క్లుప్తంగా

గిద్దలూరులో శాంతియుత ర్యాలీ


ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్లు

గిద్దలూరు రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ఉన్నత స్థాయిలో పారదర్శకంగా విచారణ చేపట్టాలని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశారు. గురువారం గిద్దలూరులో క్రైస్తవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులకు, పాస్టర్లకు క్రైస్తవ వ్యతిరేక శక్తుల నుంచి రక్షణ కల్పించాలని, మత విద్వేషకులను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు శామ్యూల్, నారాయణ, జాషువా, కరుణ, ఫిలిప్, చంద్రశేఖర్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ

కంభం: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా చేపట్టిన కెమిస్ట్రీ ల్యాబ్, ప్లే గ్రౌండ్స్, స్కాట్స్, గైడ్స్, ర్యాంప్ పనులను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు. పీఎంశ్రీ నిధులు మౌలిక వసతుల ఏర్పాటుకు, పాఠశాల అభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పనులను పారదర్శకంగా చేపడుతున్న ప్రిన్సిపాల్ చాముండేశ్వరిని అభినందించారు.

నాటుసారా బట్టీ ధ్వంసం


సారాబట్టీని ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లి గ్రామ పరిధిలో గురువారం ఎక్సైజ్ అధికారులు నాటుసారా బట్టీని ధ్వంసం చేశారు. 100 లీటర్ల బెల్లపు ఊటను పారబోసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారీ, రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు హెచ్చరించారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ యూసఫ్ షరీఫ్, సిబ్బంది శ్రీపతి, రహ్మతుల్లా, అసదుల్లా పాల్గొన్నారు.

మహాప్రస్థానానికి ఫ్రీజర్ అందజేత


ఫ్రీజర్ బాక్సు అందజేస్తున్న జనార్దన్, పక్కన ఆర్యవైశ్య నాయకులు

తర్లుపాడు: స్థానిక హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీకి గురువారం వాసవీ సత్ర సముదాయాల జాయింట్ సెక్రటరీ పోలేపల్లి జనార్దన్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జవ్వాజి విజయభాస్కర్‌రావు, నాయకులు నేరెళ్ల సాంబశివరావు, మల్లికార్జునరావు, సీహెచ్ శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ సేవలు బంద్



కంభం రైల్వే స్టేషన్, పార్శిల్ సర్వీస్‌లు నిలిపివేయడంతో కంభం రైల్వే స్టేషన్‌లో ఉండిపోయిన వాహనం(ఫైల్)

- కంభం రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన పార్శిల్ సేవలు
- వారం రోజుల క్రితం రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, ప్రయాణికులు
- ఆదాయం వస్తున్నా సేవల నిలిపివేతపై ఆగ్రహం

కంభం: బ్రిటిష్ హయాంలోనే ప్రారంభమైన కంభం రైల్వే స్టేషన్‌లో ఏళ్ల తరబడి అందిస్తున్న ఉన్న పార్శిల్ సేవలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. దీంతో రైల్వే అధికారుల తీరుపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు రైల్వే జోన్ పరిధిలోని కంభం, వినుకొండ రైల్వే స్టేషన్లలో పార్శిల్ సేవలను మార్చి నెల 26వ తేదీ నుంచి నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పరిణామంతో గత కొన్నేళ్లుగా లైసెన్స్‌డ్ పోర్టర్‌గా పనిచేస్తున్న వారు ఉపాధి కోల్పోయారు. అంతేకాకుండా కంభం నుంచి ఇతర ప్రాంతాలకు వస్తువులు, వాహనాలు, నిత్యావసరాల ఎగుమతి, దిగుమతి నిలిచిపోవడంతో సంబంధిత వర్గాలవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గిద్దలూరు, మార్కాపురం రైల్వే స్టేషన్లకు వెళ్లి పార్శిల్ చేసుకోవడం అదనపు భారం అవుతోందని వ్యాపారులు, సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **ఉన్నతాధికారుల ఆదేశంతో నిలిపేశాం**
>
> కంభం రైల్వే స్టేషన్‌లో పార్శిల్ సర్వీసులు నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. నాలుగు జోన్ల పరిధిలో 5 స్టేషన్లలో పార్శిల్ సర్వీసులు నిలిపివేయగా అందులో కంభం రైల్వే స్టేషన్ ఉంది. అవసరమైన వారు గిద్దలూరు, మార్కాపురం రైల్వే స్టేషన్లలో బుక్ చేసుకోవాలి.
>
> – టి.శంకర్, కమర్షియల్ సూపరింటెండెంట్

వ్యాపారులు, సైనికులకు ఇక్కట్లు

పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నియోజకవర్గంలో 5 వేల మంది వరకు సైనికులు, 11 వేల మందికి పైగా మాజీ సైనికులు ఉన్నారు. కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల నుంచి నిత్యం సైనికులు రైళ్లలోనే ప్రయాణిస్తూ వారి లగేజీలు అధికంగా ఉండటంతో పార్శిల్ సర్వీసును వినియోగించుకుంటుంటారు. కనిగిరి ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు కర్ణాటకకు వ్యాపార నిమిత్తం కంభం రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వారి వస్తువులు, ద్విచక్ర వాహనాలు రైళ్లలో బుక్ చేసుకుని వెళ్తుంటారు. అదే విధంగా బళ్లారి, కర్ణాటక, ఇతర ప్రాంతాల నుంచి సరుకులు, నిత్యావసర వస్తువులు తెప్పించుకుంటుంటారు. రైళ్లలో పార్శిల్ ఖర్చు తక్కువగా ఉండటం, దూర ప్రాంతాలకు సైతం సర్వీసులు ఉండటంతో ఎక్కువ మంది ఇటు వైపే మొగ్గుచూపుతుంటారు. విజయవాడ, హైదరాబాద్ నగరాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ద్విచక్రవాహనాలు, లగేజీని రైళ్లలో బుక్ చేసుకొని తీసుకెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా పార్శిల్ సర్వీసులు నిలిపివేయడంతో వీరందరూ తంటాలు పడాల్సి వస్తోంది.

ప్రైవేట్‌పరంలో భాగమేనా?

ఇటీవల కాలంలో రైల్వే శాఖలోని పలు విభాగాలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించే కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పార్శిల్ సర్వీసులు కూడా వారి చేతుల్లోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. హెడ్ క్వార్టర్ నుంచి మరో హెడ్ క్వార్టర్‌కు లగేజీ పెట్టెల్లో పార్శిల్స్ నిండిపోతుండటంతో ఇతర చిన్న స్టేషన్లలో బుక్ చేసుకున్న వస్తువులు మూడు నాలుగు రోజులకుగానీ గమ్య స్థానాలకు చేరడం లేదు. హెడ్ క్వార్టర్స్‌నే ప్రామాణికంగా చేసుకున్న ప్రైవేట్ ఏజెన్సీలు అంచెలంచెలుగా చిన్నపాటి స్టేషన్లలోని సర్వీసులను తొలగించేందుకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కంభం స్టేషన్‌లో సర్వీసులు ఆపేసినట్లు తెలుస్తోంది. పార్శిల్ సేవల ద్వారా నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తున్న కంభం స్టేషన్‌లో సర్వీసులు నిలిపివేయడంపై వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

> **జీవనోపాధి కోల్పోయా..**
>
> 
>
> మా నాన్న 1972వ సంవత్సరం నుంచి కంభం రైల్వే స్టేషన్‌లో పోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వయసు పైబడటంతో 2010 నుంచి నేను పనిలో చేరాను. నాకు ఎటువంటి జీతం రాదు. బుకింగ్ అయిన వస్తువులను రైల్లో ఎక్కించడం, దించడం చేస్తుంటా. అందుకుగాను కూలి ఇస్తుంటారు. రోజుకు 100–300 ఆదాయం వస్తుంది. ఒక్కోసారి బుకింగ్‌లు లేకుంటే రూపాయి కూడా రాదు. ఒక్కసారిగా పార్శిల్ సేవలు నిలిపివేయడంతో రోడ్డున పడినట్టయింది.
>
> – ఖాదర్ బాషా, లైసెన్స్‌డ్ పోర్టర్, కంభం రైల్వేస్టేషన్

> **సరుకులు తెచ్చుకోవడం కష్టం**
>
> 
>
> హుబ్లీ నుంచి మూడు రోజులకొకసారి రెడీమేడ్ పరోటా, చపాతి, పుల్కా ప్యాకెట్లు తెప్పించి ఇక్కడ దుకాణాలకు వేసి విక్రయిస్తుంటాం. హుబ్లీ నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో అక్కడ రైల్లో పార్శిల్ బుక్ చేస్తే ఇక్కడ నేను తీసుకుని వ్యాపారం చేసుకుంటా. ప్రస్తుతం కంభంలో పార్శిల్ సర్వీసులు ఆపేయడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.
>
> – షేక్ అక్బర్ బాషా, వ్యాపారి, కంభం

పెన్షనర్ల సంక్షేమానికి సహకరిస్తాం

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె



అన్నా రాంబాబును సన్మానిస్తున్న నాయకులు

తర్లుపాడు: మార్కాపురం నియోజకవర్గ పెన్షనర్ల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, జిల్లా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పెన్షనర్ల విభాగం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన తర్లుపాడు మండలం మీర్జపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తాతిరెడ్డి రంగారెడ్డి నియమితులు కావడంతో ఆయన గురువారం మాజీ ఎమ్మెల్యేలను కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు రామిరెడ్డి, కాశయ్య, రమణారెడ్డి, శిఖామణి, ఎబినేజర్, నాయకులు మల్లారెడ్డి, వెలుగొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, శేషయ్య, ఎస్సీ సెల్ నాయకులు గురవయ్య తదితరులు ఉన్నారు.

నేర నియంత్రణకు సహకరించండి


మాట్లాడుతున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం సుందరయ్య కాలనీలో ప్రజలకు నేర నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవించి గొడవలు పడటం, పోలీసు కేసులు పెట్టుకోవడం, కోర్టుల చుట్టూ తిరగడం సరికాదని హితవు పలికారు. పేకాట, మట్కా, బెల్టుషాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా వీటిని నిర్వహిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎమ్ఈసీ గ్రూప్‌ల్లో సీట్ల భర్తీకి మే 22వ తేదీలోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 దరఖాస్తు ఫీజు చెల్లించాలని సూచించారు. 10వ తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ రూల్స్ ఆధారంగా సీట్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు 95428 78916, 95023 35251, 91776 72171ను సంప్రదించాలని సూచించారు.

నూతన పే కమిషన్‌తో పెన్షనర్లకు నష్టం


నినాదాలు చేస్తున్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, ఉద్యోగులు

- బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పెన్షనర్ల ధర్నా
- బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్

మార్కాపురం: పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పే కమిషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. నూతన పే కమిషన్ బిల్లులో విశ్రాంత ఉద్యోగుల వేతనానికి సంబంధించి ఎటువంటి సవరణ లేకపోవడం బాధాకరమన్నారు. బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి కోసం 4 దశాబ్దాలపాటు కృషి చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల హక్కులను కాలరాసే చట్టాలను తీసుకునిరావడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. సీఐటీయూ నాయకుల డీకేఎం రఫీ మాట్లాడుతూ.. నూతన పే కమిషన్ వల్ల దేశంలో లక్షలాది మంది పెన్షనర్ల భవిష్యత్తు అయోమయంగా మారిందన్నారు. గతంలో పే కమిషన్ రివిజన్ అయినప్పుడు ఆటోమేటిక్‌గా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కూడా పెన్షన్ పెరుగుదల ఉండేదన్నారు. ఏఐటీయూసీ నాయకుడు అందె నాసరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విభజించు, పాలించు సూత్రాన్ని పాటిస్తూ పదవీ విరమణ పొందిన, ప్రస్తుత ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారి మధ్య అగాధాన్ని సృష్టించే విధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పెన్షనర్లకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.కృష్ణారావు, ఎస్కే ఇమామ్, ఉస్మాన్ బేగ్, సలీమ్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తాం


సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

- డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

మార్కాపురం: మార్కాపురం మండలంలో ఉపాధి హామీ పథకం కూలీలకు మస్టర్ విషయంలో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేస్తామని ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు గ్రామాల్లో నివేదికలు పరిశీలించి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దాదాపు 12 గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించామని, ఇంకా కొన్ని గ్రామాలు పరిశీలించాల్సి ఉందన్నారు. చెరువుల్లో పూడిక, చెక్‌డ్యామ్‌లో పూడిక తదితర పనులు ఎక్కువగా జరిగాయని, కొలతల్లో వ్యత్యాసాలను గుర్తించామని చెప్పారు. గత రెండేళ్లుగా సోషల్ ఆడిట్ జరగకపోవడం, వర్షాల వలన పూడిక పెరిగిపోవడం లాంటి కారణాలు ఉన్నాయన్నారు. హార్టికల్చర్‌కు సంబంధించి కొన్నిచోట్ల మొక్కలు లేవని, దీనిపై హార్టికల్చర్ అధికారిని నివేదిక కోరామన్నారు. వారానికి మూడు రోజులు పని కల్పించాల్సిన చోట కొంత మంది మేట్‌లు ఎక్కువ పనిదినాలు కల్పించారని, అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, విజిలెన్స్ ఆఫీసర్ వండర్‌మెన్, స్టేట్ రిసోర్స్ పర్సన్ మూర్తి, ఏపీఓ జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ


కాలువపల్లెలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

రాచర్ల: మండలంలోని కాలువపల్లె గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. మండల కేంద్రమైన రాచర్ల నుంచి కాలువపల్లె గ్రామానికి వెళ్లే దారిలో కొండ తిప్పల వెంట ఉన్న ప్రభుత్వ స్థలాలను చదును చేసి అక్రమించుకుంటున్నారు. ఆ స్థలాల్లో పశువుల మేత నిల్వ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అంతేకాక రాచర్ల తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో భూములు ఆక్రమించుకుంటున్నప్పటికీ రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ విషయంపై తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లును వివరణ కోరగా 'కాలువపల్లె గ్రామ సమీపంలోని చెరువు తొట్టి భూమి ఆక్రమణను పరిశీలించాం. ఆ భూమి తనదేనని ఆక్రమించిన వ్యక్తి మాట్లాడటంతో డాక్యుమెంట్లు తీసుకుని విచారణకు రావాలని ఆదేశించాం' అని తెలిపారు.

నిత్య సాహితీ కృషీవలుడు మధుసూదన్


మధుసూదన్‌ను సన్మానిస్తున్న కవులు, కళాశాల సిబ్బంది

మార్కాపురం టౌన్: విశ్వావసు ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతిష్టాత్మకమైన కోటి సూర్యమ్మ స్మారక సాహితీ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ కవి, అష్టావధాని డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ నిత్య సాహితీ కృషీవలుడని విద్యాశాఖ రిటైర్డ్ ఆర్‌జేడీ, కవి డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి కొనియాడారు. మధుసూదన్ అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం స్థానిక సాధన కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంతో పాటు జిల్లాలో కవులను ప్రోత్సహిస్తూ నెలనెలా వెన్నెల కార్యక్రమం ద్వారా సాహిత్యపరంగా మధుసూదన్ తనవంతు సహకారం అందిస్తున్నారన్నారు. ఇది ఒక గొప్ప సాహితీ యజ్ఞమని, కవులను ఒక్క తాటిపై నడిపే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సాహిత్య రంగంలో మక్కువ పెంచుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్‌కుమార్, పలువురు కవులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సచివాలయాలు!

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సచివాలయానికి వివిధ పనుల కోసం వచ్చిన వారు ఖాళీ కుర్చీలను చూసి వెనుదిరుగుతున్న పరిస్థితి. గురువారం పాములపాడు సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు ఒకే ఒక్కరు విధుల్లో ఉన్నారు. కందుల కొనుగోలు కేంద్రం, రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్ తలుపులు తీయలేదు. మధ్యాహ్నం 3.30 గంటలకే సిబ్బంది వెళ్లిపోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



తలుపులు తెరుచుకోని రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనం


ఖాళీగా కందుల కొనుగోలు కేంద్రం


పాములపాడు సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు